ఆంధ్ర ప్రదేశ్
మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాలలో
విజ్ఞాన్ పత్రికకు
విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA

APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 83 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి శనివారం 25 ఏప్రిల్ 2026 పేజీలు : 04 వెల : 02

# ప్రొస్టేట్ క్యాన్సర్‌ను జయించిన నెతన్యాహూ

**తనకు గతంలో క్యాన్సర ఉందని ప్రకటించిన నెతన్యాహూ..!**
**ఇప్పుడు అంతా నయమైందని ట్వీట్..!**



ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూకు క్యాన్సర్ ఉందని నిర్ధారణ అయింది. అయితే, ప్రొస్టేట్ క్యాన్సర్ నుంచి తాను పూర్తిగా కొలుకున్నట్లు నెతన్యాహూ ప్రకటించారు. యుద్ధం తీవ్రంగా కొనసాగుతున్న సమయంలో తన వార్షిక ఆరోగ్య నివేదిక బయటకు రాకుండా ఉండేందుకు, ఇరాన్ ఉగ్రవాద ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేయకుండా ఉండేందుకు దీనిని 2 నెలల పాటు వాయిదా వేయాలని తానే అభ్యర్థించినట్లు నెతన్యాహూ ఒక ట్వీట్‌లో చెప్పారు.

# ఇరాన్ పన్నుల దారిలో మరో ముస్లిం దేశం

**హోర్ముజ్ తర్వాత మలక్కా జలసంధి**
**మంత్రి వ్యాఖ్యలతో కలకలం**
**హోర్ముజ్ ఉద్రిక్తతల ప్రభావం**
**భారీగా పెరిగిన నౌకా రాకపోకలు**



ఇజ్రాయెల్, అమెరికా–ఇరాన్ యుద్ధం కాస్తా.. ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తోంది.. మధ్యప్రాచ్యంలో హోర్ముజ్ జలసంధి ఉద్రిక్తతల ప్రభావం ఇంకా కొనసాగుతుండగానే, ఇప్పుడు ఆసియాలోని కీలక సముద్ర మార్గమైన మలక్కా జలసంధి మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. ఇండోనేషియా ఆర్థిక మంత్రి చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ వాణిజ్య రంగంలో కలకలం రేపాయి. మలక్కా జలసంధి గుండా ప్రయాణించే ఓడలపై సుంకాలు విధించే అవకాశాన్ని ఆయన ప్రస్తావించడంతో ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇండోనేషియా ఆర్థిక మంత్రి పూర్బయ యుధి సాదేవ్ ఇటీవల మాట్లాడుతూ, తమ నియంత్రణలో ఉన్న మలక్కా జలసంధి గుండా వెళ్లే నౌకలపై టోల్ విధిస్తే దేశానికి భారీ ఆదాయం లభిస్తుందని అన్నారు. ఈ వ్యాఖ్యలతో, ఇరాన్ హోర్ముజ్ జలసంధిలో అనుసరిస్తున్న విధానాన్ని ఇండోనేషియా కూడా అనుసరిస్తుందా అనే చర్చ మొదలైంది.

# ఈ ఏడాది ఎల్‌నినో ముప్పు

## పీఎండీఎస్ అస్త్రాన్ని ప్రయోగించాలన్న చంద్రబాబు

- వ్యవసాయ రంగంపై ఉన్నతస్థాయి సమీక్ష
- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పీఎండీఎస్ విధానం అమలు
- రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని సీఎం ఆదేశం
- రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళిక
- సాంకేతికత వినియోగంతో రైతులకు మెరుగైన సేవలు
- ఈ ఏడాది 11 లక్షల హెక్టార్లలో ప్రకృతి సేద్యం లక్ష్యం
- వ్యవసాయంలో సమూల మార్పులే లక్ష్యం
- హార్టికల్చర్ హబ్.. ప్రత్యేక పంటలపై దృష్టి
- ప్రకృతి సాగుకు పెద్దపీట
- సాంకేతికతతో రైతుకు భరోసా



రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం చూపే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో, దానిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టింది. వ్యవసాయ రంగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం జరిపిన ఉన్నతస్థాయి సమీక్షలో ఈ అంశంపై ప్రధానంగా చర్చించారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల వల్ల సగటు వర్షపాతం 92 శాతానికే పరిమితం కావచ్చని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రాయలసీమలోని అనంతపురం, సత్యసాయి, కడప, కర్నూలుతో పాటు ప్రకాశం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు తలెత్తవచ్చని, ఇది పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సవాలును అధిగమించేందుకు 'ప్రీ-మాన్‌సూన్ డ్రై సోయింగ్' (పీఎండీఎస్) విధానాన్ని ఒక అస్త్రంగా ప్రయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# కేజ్రీవాల్‌కు బిగ్ షాక్

- బీజేపీలోకి రాఘవ్ చద్దా సహా ఏడుగురు రాజ్యసభ సభ్యులు
- ఆమ్ ఆద్మీ పార్టీపై రాజ్యసభ ఎంపీలు తిరుగుబాటు
- డిప్యూటీ లీడర్ పదవి నుంచి రాఘవ్ చద్దా తొలగింపు
- బీజేపీలో ఆప్ పార్లమెంటరీ పార్టీ విలీనం చేస్తున్నట్టు ప్రకటన
- కేజ్రీవాల్ తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు తెర






**నెలాఖరులో లేదంటే మే మొదటి వారంలో**
**ఇండీ కూటమి మహిళా వ్యతిరేకి.. విపక్షాలు చేసిన అన్యాయాన్ని సభలో ఎండగడదాం**
**టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు పిలుపు**
**ఏడాదంతా పొలం పచ్చగా ఉండాలి**
**వ్యవసాయం మరింత బలోపేతం కావాలి**
**సాగుపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష**

మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతుగా అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ నెలాఖరులో లేదా మే మొదటివారంలో వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ బిల్లును వ్యతిరేకించిన ఇండీ కూటమి పార్టీల వైఖరిని ప్రజల్లో ఎండగట్టేందుకు అసెంబ్లీని వేదికగా చేసుకోవాలని ఎన్‌డీఏ నేతలకు సూచించారు. కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులతో ఆయన శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్లమెంటులో మహిళా బిల్లును అడ్డుకున్న ఇండీ కూటమి తీరును నిరసిస్తూ చేపట్టాల్సిన కార్యక్రమాలపై వారికి దిశానిర్దేశం చేశారు. మహిళలకు అన్యాయం చేసిన పార్టీల వైఖరిని ఎండగడుతూ నిరసనలు చేపట్టాలన్నారు. బిల్లును అడ్డుకుని ఇండీ కూటమి పార్టీలు తీవ్ర అన్యాయం చేశాయని విమర్శించారు. మహిళలకు న్యాయం చేసేందుకు ఎన్‌డీఏ పార్టీలు మొదటి నుంచీ కృషి

# మళ్లీ రాజకీయాల్లోకి విజయసాయిరెడ్డి

- జూలై నెలలో రీఎంట్రీ ఉంటుందన్న మాజీ ఎంపీ
- ఏపీలో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య
- ఆంధ్రప్రదేశ్‌లో మరో రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఉంది : విజయసాయిరెడ్డి
- 2024 ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న విజయసాయిరెడ్డి
- వైసీపీ పార్టీ నేతలు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలి
- ఇకనైనా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి





# అనంతబాబు అరెస్టు

- నాలుగు రోజులుగా పరారీలో ఎమ్మెల్సీ
- రాజమండ్రి కోర్టు వద్ద హఠాత్తుగా ప్రత్యక్షం
- కారులోంచి దిగీ దిగగానే కోర్టులోకి పరుగు
- డ్రైవరు హత్య కేసులో విచారణకు హాజరు
- కోర్టులోంచి బయటకు వస్తుండగా అరెస్టు
- ఏసీ జీపులో కాకినాడకు తరలింపు
- స్వామిభక్తి ప్రదర్శించిన పోలీసులు!
- అనంతబాబుపై అర్ధరాత్రి వరకు ప్రశ్నలవర్షం
- నేడు కోర్టులో హాజరుపర్చనున్న పోలీసులు

# ఈ ఏడాది ఎల్‌నినో ముప్పు

## పీఎండీఎస్ అస్త్రాన్ని ప్రయోగించాలన్న చంద్రబాబు

వర్షాలు కురవకముందే విత్తనాలు నాటే ఈ పద్ధతి ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చు, ఎరువులు, నీటి వినియోగం తగ్గుతుందని అధికారులు వివరించారు. తద్వారా ఎకరాకు రూ.5,000 నుంచి రూ.7,000 వరకు అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఎకరాల్లో పీఎండీఎస్ విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా నిర్దేశించారు.

**వ్యవసాయంలో సమూల మార్పులే లక్ష్యం :** రైతుకు సాగు భద్రత కల్పించి, అధిక ఆదాయం సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఏడాదంతా పొలం పచ్చగా ఉండేలా, భూమిని భాగాలుగా విభజించి ఒకే రైతు బహుళ పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల వైపు రైతులను మళ్లించాలని, వాటి వల్ల కలిగే లాభాలను వివరించి చెప్పాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతు బజార్ల నుంచి నేరుగా ఇంటికే సరుకులు డెలివరీ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, అవసరమైతే ఏజెన్సీల సేవలు వినియోగించుకోవాలని ఆదేశించారు.

**హార్టికల్చర్ హబ్.. ప్రత్యేక పంటలపై దృష్టి :** రాష్ట్రంలో ఉద్యానవన రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. మొత్తం 50 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ సాగు చేపట్టేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా రాయలసీమను 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దేందుకు క్లస్టర్ల వారీగా అభివృద్ధి ప్రణాళికలు చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా ప్రపంచంలోనే తొలిసారిగా 250 ఎకరాల్లో 'కోకో సిటీ' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇది ఔత్సాహిక రైతులకు ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా ఉపయోగపడాలని సూచించారు. అరకులో కుంకుమ పువ్వు, అనంతపురంలో యాపిల్ సాగును ప్రోత్సహించడంతో పాటు అవకాడో, అంజీర్, పనస, మిరియాల సాగును విస్తరించాలని నిర్దేశించారు. అంజీర్ వంటి పండ్లను డ్రైఫ్రూట్స్‌గా మార్చి విలువ పెంచేలా చూడాలన్నారు. 'ఏపీ మష్రూమ్ మిషన్ 2026-31' కింద ఏటా లక్ష మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించాలని లక్ష్యం నిర్దేశించారు.

**ప్రకృతి సాగుకు పెద్దపీట :** రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని అన్ని గ్రామాలకు విస్తరించాలని ముఖ్యమంత్రి భారీ లక్ష్యాన్ని నిర్దేశించారు. 2025-26లో 9.26 లక్షల హెక్టార్లలో ప్రకృతి సేద్యం జరగగా, ఈ ఏడాది (2026-27) ఏకంగా 11 లక్షల హెక్టార్లకు పెంచాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 13,300 గ్రామ పంచాయతీల్లో 25 లక్షల మంది రైతులను ఇందులో భాగస్వాములను చేయాలన్నారు. ప్రకృతి సాగు ఉత్పత్తులకు సరైన సర్టిఫికేషన్ అందించి, అధిక ధరకు అమ్ముకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**సాంకేతికతతో రైతుకు భరోసా :** వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత వినియోగంపై సీఎం దృష్టి సారించారు. 'ఫార్మర్ యాప్'లో ఇప్పటివరకు 8 లక్షల మంది రైతులు నమోదు చేసుకున్నారని అధికారులు తెలుపగా, రిజిస్ట్రేషన్‌తో పాటు ఎంతమంది రైతులు దానిని వినియోగించి లబ్ధి పొందుతున్నారనేదే ముఖ్యమని సీఎం అన్నారు. ఈ యాప్ ద్వారా పంటల వివరాలు, భూసార పరీక్షలు, వాతావరణ సమాచారం, ప్రభుత్వ పథకాలు వంటివి రైతులకు అందుబాటులో ఉంటాయి. అదేవిధంగా, రైతు భరోసా కేంద్రాల పనితీరును పర్యవేక్షించేందుకు రూపొందించిన 'ఆర్ఎస్కే ఇంటిలిజెన్స్ హబ్ డ్యాష్‌బోర్డ్'లో సమాచారం ఎప్పటికప్పుడు కచ్చితంగా ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.

## ప్రొస్టేట్ క్యాన్సర్‌ను జయించిన నెతన్యాహూ

ప్రస్తుతం దేవుడి దయ వల్ల తన ఆరోగ్యం బాగానే ఉందని, శారీరక స్థితి బాగుందని, గతంలో నా ప్రొస్టేట్‌కు సంబంధించి చిన్న సమస్య ఉండేదని, ఇప్పుడు అది పూర్తిగా నయమైందని తెలిపారు. దాదాపు ఏడాదిన్నర క్రితం ప్రొస్టేట్ ఎన్‌లార్జ్‌మెంట్ సమస్యకు శస్త్రచికిత్స చేయించుకున్నట్లు తెలిపారు. అప్పటి నుంచి రెగ్యులర్ చెకప్ చేయించుకుంటున్నట్లు వెల్లడించారు. అయితే, ఇటీవల ప్రొస్టేట్‌లో ఒక సెంటీమీటర్ కన్నా చిన్న సైజులో ఒక మచ్చ గుర్తించినట్లు, దీనిని టెస్ట్ చేయగా ఇది ఫస్ట్ స్టేజ్ క్యాన్సర్ ట్యూమర్‌గా తేలిందని, కానీ అది ఎక్కడికి వ్యాపించలేదు(మెటాస్టాసిస్ లేదు) అని చెప్పారు. నా వయసు ఉన్న వారిలో ఇది సాధారణమని చెప్పారు. దీనిని ఎదుర్కొనేందుకు రెండు మార్గాలు ఉన్నాయని- చికిత్స చేయకుండా కేవలం పర్యవేక్షణలో ఉండవచ్చు, చాలా మంది ఇలా జీవిస్తున్నారు, చికిత్స చేసి సమస్యను పూర్తిగా తొలగించుకోవచ్చు అని సూచించారు.ప్రమాదం గురించి ముందుగానే సమాచారం వస్తే, దాన్ని వెంటనే ఎదుర్కోవాలని తాను నమ్ముతానని, ఇది దేశం విషయంలోనైనా, వ్యక్తిగతంగా అయినా తనది ఇదే విధానం అని చెప్పారు. అందుకే తాను రెండో మార్గాన్ని ఎంచుకున్నారని, టార్గెటెడ్ ట్రీట్మెంట్ తీసుకున్నానని, సమస్యను పూర్తిగా తొలగించుకున్నానని వెల్లడించారు. ఇప్పుడు పూర్తిగా క్యాన్సర్ మాయమైందని, దేవుడి దయ వల్ల దీనిని తాను అధిగమించినట్లు చెప్పారు. ఇజ్రాయిల్ ప్రజలు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడంతో పాటు, సమయానికి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

# కేజ్రీవాల్‌కు బిగ్ షాక్

ఆమ్ ఆద్మీ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు.. బీజేపీలో చేరుతున్నట్టు ప్రకటించారు. వీరిలో ఒకరు యువ ఎంపీ రాఘవ్ చద్దా. ఆయనను ఇటీవలే రాజ్యసభలో డిప్యూటీ లీడర్ పదవి నుంచి ఆప్ తొలగించిన సంగతి తెలిసిందే. కేజ్రీవాల్ తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు తెరతీసింది. ఇలాంటి తరుణంలో ఆప్‌లో తిరుగుబాటు చోటుచేసుకోవడం గమనార్హం. ఏకంగా ఆప్ పార్లమెంటరీ పార్టీని విలీనం చేస్తున్నట్టు ప్రకటించారు. అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ ( ఆప్ )లో ముసలం పుట్టింది. ఇటీవల రాజ్యసభలో ఆప్ డిప్యూటీ లీడర్ పదవి నుంచి తొలగింపునకు గురైన యువ ఎంపీ రాఘవ్ చద్దా బీజేపీలో చేరబోతున్నట్టు ప్రకటించారు. ఆప్ ప్రస్తుతం అవినీతిపరుల చేతుల్లో ఉందని, ఎంతో కష్టపడి పార్టీని పైకి తీసుకొచ్చామని చద్దా విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షాల నాయకత్వంలో పనిచేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆయన సహా ఏడుగురు ఎంపీలు బీజేపీలో చేరనున్నట్టు వెల్లడించారు. రాజ్యసభలోని ఆప్ ఎంపీలో మూడింట రెండొంతుల మంది పార్టీని వీడుతున్నారు. ఆప్ పార్లమెంటరీ పార్టీని బీజేపీలో విలీనం చేయనున్నారు. రాఘవ్ చద్దా , సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్‌లు పార్టీని వీడి బీజేపీలో చేరనున్నట్లు ప్రకటించడం గమనార్హం. ఈ పరిణామం అరవింద్ కేజ్రీవాల్‌కి పెద్ద ఎదురుదెబ్బగానే చెప్పుకోవాలి. ఇటీవలే డిప్యూటీ లీడర్ పదవి నుంచి రాఘవ్ చద్దాను తొలగించి.. ఆయన స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించారు. అశోక్ మిట్టల్ కూడా కేజ్రీకి హ్యాండిచ్చి, బీజేపీలో చేరుతుండటం గమనార్హం. రాజ్యసభలో ఆప్‌కి మొత్తం 10 మంది ఎంపీలు ఉండగా.. ఇప్పటికే హర్భజన్ సింగ్, స్వాతి మలివాల్‌లు పార్టీకి దూరమయ్యారు. బీజేపీలో విలీనమవుతున్న ఎంపీలలో హర్భజన్ సింగ్, స్వాతి మాలివాల్ ఉన్నారని, మరో నలుగురు రాజిందర్ గుప్తా, విక్రమ్ సింగ్ సాహ్నీ, అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్‌ల పేర్లను చద్దా వెల్లడించారు. "నేను నా జీవితంలోని 15 ఏళ్లు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి అంకితం చేశాను... ఇప్పుడు ఆ పార్టీ అవినీతిపరుల చేతుల్లో ఉంది.. నేను తప్పుడు పార్టీలో ఉన్న సరైన వ్యక్తిని. నేను పార్టీకి దూరమై ప్రజలకు దగ్గరవుతున్నాను.. " అని ఆయన వ్యాఖ్యానించారు. తమ వెంట 8 మంది ఎంపీలు ఉన్నారని చద్దా తెలిపారు. ఇక, యువ ఎంపీ బీజేపీలో చేరిన తర్వాత కేంద్ర మంత్రి పదవి దక్కే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల డిప్యూటీ లీడర్ పదవి నుంచి తొలగించిన తర్వాత.. 'తాను మౌనంగా ఉన్నా కానీ ఓడిపోలేదు.. నేను ఏ తప్పు చేశానో చెప్పాలి' అని ఆప్ అధిష్ఠానాన్ని రాఘవ్ చద్దా నిలదీశారు. చద్దా, అరవింద్ కేజ్రీవాల్ మధ్య గత కొన్ని రోజులుగా దూరం పెరిగింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఆయనను సీబీఐ ప్రత్యేక కోర్టు నిర్దోషిగా ప్రకటించిన తర్వాత కూడా చద్దా స్పందించలేదు. కేజ్రీవాల్‌కు మద్దతుగా ఒక్క మాట కూడా మాట్లడలేదు. ఈ క్రమంలోనే రాజ్యసభ డిప్యూటీ లీడర్ పదవి నుంచి తొలగించి, అశోక్ మిట్టల్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు.

# మళ్లీ రాజకీయాల్లోకి విజయసాయిరెడ్డి

రాజకీయాల్లోకి రీఎంట్రీపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి క్లారిటీ ఇచ్చారు. మళ్లీ రాజకీయాల్లోకి వస్తానన్న విజయసాయిరెడ్డి.. జులైలో పొలిటికల్ రీఎంట్రీ ఉంటుందని తెలిపారు. అలాగే మీడియా రంగంలోకి కూడా వస్తానని మరోసారి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో మరో రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 2024 ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న విజయసాయిరెడ్డి.. ఆ పార్టీ నేతలు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలన్నారు. ఇకనైనా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రత్యక్ష రాజకీయాలకు దూరమైనప్పటికీ.. రాజకీయ రంగాన్ని మాత్రం పూర్తిగా విడిచిపెట్టలేదు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన తర్వాత కొన్ని రోజుల పాటు సైలెంట్‌గా ఉన్న విజయసాయిరెడ్డి.. ఆ తర్వాత సోషల్ మీడియా ద్వారా వివిధ రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను పంచుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలోనే తన పొలిటికల్ రీఎంట్రీపై విజయసాయిరెడ్డి క్లారిటీ ఇచ్చారు. జులై నెలలో మళ్లీ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించాల్సిన అవసరం ఉందని విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. మీడియా రంగంలోకి కూడా ప్రవేశించనున్నట్లు విజయసాయిరెడ్డి మరోసారి స్పష్టం చేశారు. ఇదే క్రమంలో వైసీపీపై విమర్శలు చేశారు విజయసాయిరెడ్డి. గత ఎన్నికల్లో ఓడించి.. వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న విజయసాయిరెడ్డి.. ఇప్పటికైనా ఆ పార్టీ నేతలు తమ పద్ధతి మార్చుకుని, ప్రజాసమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. మరోవైపు 2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం తర్వాత పలువురు నేతలు ఆ పార్టీని వీడారు. ఈ క్రమంలోనే 2025 జనవరి నెలలో వైసీపీ పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి విజయసాయిరెడ్డి రాజీనామా చేశారు. రాజకీయాల నుంచి తప్పుకుంటున్నానని, తన పదవికి న్యాయం చేయలేక రాజీనామా చేస్తున్నట్లు అప్పట్లో విజయసాయిరెడ్డి ప్రకటించారు. విజయసాయిరెడ్డి రాజీనామాకు ఆ వెంటనే రాజ్యసభ ఛైర్మన్ ఆమోదం కూడా లభించింది. ఆ తర్వాత సోషల్ మీడియా ద్వారా వివిధ అంశాలపై స్పందిస్తూ వస్తున్న విజయసాయిరెడ్డి.. ఇటీవలే మీడియా రంగంలోకి ఎంట్రీ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. త్వరలోనే తెలుగు, హిందీ, ఇంగ్లీషులో డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్ ప్రారంభిస్తామని ఎక్స్ వేదికగా వెల్లడించారు. మధ్యతరగతి ప్రజలు, మహిళలు, యువత, రైతాంగం, కార్మికులకు సంబంధించిన సమస్యలను ప్రస్తావిస్తూ ప్రజా గొంతుకగా మారతామని పేర్కొన్నారు. ఏ పొలిటికల్ పార్టీకి అనుబంధంగా తాము పనిచేయమని.. డిజిటల్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించిన తర్వాత తెలుగులో శాటిలైట్ ఛానెల్ కూడా తెస్తామని పేర్కొన్నారు. త్వరలోనే వీటి పేర్లు ప్రకటిస్తామంటూ విజయసాయిరెడ్డి ఇటీవల ట్వీట్ చేయటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ క్రమంలోనే శుక్రవారం రోజున విలేకర్లతో మాట్లాడారు విజయసాయిరెడ్డి. ఏపీ లిక్కర్ కేసులో విజయసాయిరెడ్డి నివాసంలో శుక్రవారం ఈడీ సోదాలు నిర్వహించింది. ఈ సోదాలలో ఏమీ లభించలేదని విజయసాయిరెడ్డి వెల్లడించారు. ఈ క్రమంలోనే రాజకీయ విషయాలపై మాట్లాడిన విజయసాయిరెడ్డి జూలైలో రాజకీయాల్లోకి మళ్లీ వస్తానని ప్రకటించారు. అలాగే ఏపీలో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించాల్సిన అవసరముందని వ్యాఖ్యనించటంతో విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ పెడతారా అనే ఊహాగానాలు మొదలయ్యాయి.

# అనంతబాబు అరెస్టు

దళిత డ్రైవరు సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడు, వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబును పోలీసులు అనూహ్య రీతిలో అరెస్టు చేశారు. సాక్షులను బెదిరించిన వ్యవహారంలో ఆయన అరెస్టు కోసం పోలీసులు గాలిస్తున్నారు. వారి కళ్లు కప్పి నాలుగు రోజులుగా తప్పించుకుని తిరుగుతున్న అనంతబాబు శుక్రవారం రాజమహేంద్రవరం కోర్టు వద్ద హఠాత్తుగా ప్రత్యక్షమయ్యారు. హత్య కేసులో కోర్టు విచారణ కోసం ఉదయం 10.20 గంటలకు కారులో ఆయన వచ్చారు. కోర్టు ప్రాంగణంలో కారు ఆగీ ఆగగానే కోర్టు హాలులోకి పరుగులు పెట్టారు. రెండో నిందితురాలిగా ఉన్న ఆయన భార్య లక్ష్మీ దుర్గ అప్పటికే కోర్టుకు చేరుకున్నారు. ఈ కేసు విచారణను కోర్టు వాయిదా వేయడంతో ఎదురుగా ఉన్న మరో కోర్టు భవనంలోకి వెళ్లి న్యాయవాదులు వేచిఉండే గదిలో వారిద్దరూ కూర్చున్నారు. అప్పటికే హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. అక్కడ సాంకేతిక లోపం తలెత్తడంతో క్వాష్ పిటిషన్‌పై ఎలాంటి నిర్ణయమూ వెలువడలేదు. దీంతో అరెస్టు అనివార్యమైంది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తన లాయర్లతో అనంతబాబు కోర్టు ప్రాంగణం బయటకు రావడంతోనే పోలీసులు అరెస్టు చేశారు. ఏసీ సదుపాయం ఉన్న పోలీస్ జీప్‌లో ఆయనను కాకినాడకు తరలించారు. సాధారణంగా నిందితులను పోలీస్ వ్యాన్‌లో తరలించడం ఆనవాయితీ. అయితే అందుకు భిన్నంగా పోలీసులు స్వామి భక్తి చూపించడం కొసమెరుపు. అనంతబాబు తన లాయర్లతో కలిసి కోర్టు హాలులోకి పరుగెత్తడం తొలిసారి 'ఏబీఎన్'లో ప్రసారమైంది. అది చూసిన స్థానిక పోలీసులు అనంత బాబును పట్టుకునేందుకు పరుగెత్తారు.

## పవన్ ఖేరా ముందస్తు బెయిల్ ను తిరస్కరించిన గౌహతి హైకోర్టు

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ముందస్తు బెయిల్ పిటిషన్ ను గౌహతి హైకోర్టు శుక్రవారం తిరస్కరించింది. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ భార్య రినికి భుయాన్ శర్మ ఆయనపై అస్సాం పోలీస్ క్రైం బ్రాంచ్ లో కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఈ నెల 21న పవన్ ఖేరా ముందస్తు బెయిల్ పై గౌహతి హైకోర్టు తన ఆదేశాలను రిజర్వ్ చేసింది. ఏప్రిల్ 4న ఖేరా నిర్వహించిన విలేకరుల సమావేశంలో, రినికి శర్మ వేర్వేరు దేశాల పాస్ పోర్టులు కలిగి ఉన్నారని, విదేశాల్లో ఆస్తులు ఉన్నారని పేర్కొన్నారు. దీనిపై ఆమె ఏప్రిల్ 5న కేసు నమోదు చేశారు. ఏప్రిల్ 7న న్యూఢిల్లీలోని పవన్ ఖేరా నివాసంలో సోదాలు కూడా జరిగాయి.



## మహిళా బిల్లుకు మద్దతుగా ప్రత్యేక అసెంబ్లీ!

చేస్తున్నాయన్నారు. 'కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే పార్టీలు మహిళలకు చేసిన అన్యాయాన్ని ప్రజలకు వివరించాలి. ఇండి కూటమి పార్టీల తీరును నిరసిస్తూ రాష్ట్ర, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించాలి. స్త్రీశక్తి పేరుతో సదస్సులు నిర్వహించాలి. టీడీపీ-జనసేన-బీజేపీ నేతలు సమన్వయంతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలి. ఈ నెల 30వ తేదీలోగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో నిరసనలు తెలపాలి' అని వివరించారు. 1996 నుంచీ చట్టసభల్లో మహిళా బిల్లును కాంగ్రెస్ అడ్డుకుంటూనే ఉందన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాజ్యసభలో బిల్లు పెట్టినప్పుడు బీజేపీ మద్దతిచ్చినా.. లోక్‌సభలో కాంగ్రెస్ బిల్లు పెట్టలేదని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రధాని మోదీ నేతృత్వంలో పెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లును ఇండీ కూటమి అడ్డుకుందన్నారు. డీలిమిటేషన్ సాకు చెప్పి బిల్లుకు మద్దతు ఇవ్వకుండా వీగిపోయేలా చేశారని ధ్వజమెత్తారు. 50 శాతం సీట్లు పెంచేలా ప్రతిపాదించిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుతో దక్షిణాదికి ఎలాంటి ఇబ్బందీ లేదని, ఏ రాష్ట్రానికీ ఇబ్బంది రాకుండా చూసుకుంటామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా చెప్పారని, అవసరమైతే బిల్లులో మార్పులు చేస్తామని స్పష్టం చేసినా అడ్డుకోవడం దారుణమని మండిపడ్డారు. ఎన్డీఏ మహిళా పక్షపాతి... ఇండీ కూటమి మహిళా వ్యతిరేకి అని వ్యాఖ్యానించారు. మహిళలకు తొలి నుంచీ ప్రాధాన్యమిచ్చిన ఘనత టీడీపీకి దక్కుతుందన్నారు. దేశంలో మహిళా విశ్వవిద్యాలయాన్ని తొలిసారిగా ఎన్టీఆరే పెట్టారని, స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లను కల్పించింది టీడీపీయేనని చంద్రబాబు తెలిపారు. టెలికాన్ఫరెన్స్‌లో బీజేపీ తరఫున రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, జనసేన తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడారు.

## ఇరాన్ పన్నుల దారిలో మరో ముస్లిం దేశం

అయితే, ఈ వ్యాఖ్యలపై ప్రపంచవ్యాప్తంగా స్పందనలు రావడంతో ఇండోనేషియా ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇచ్చింది. మలక్కా జలసంధి గుండా వెళ్లే నౌకలపై ఎలాంటి రవాణా రుసుములు లేదా టోల్ విధించే ప్రణాళికలు లేవని మంత్రి ప్రకటించారు. తమ దేశం ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టాల ఒప్పందం (ఖచీజూూూ)కు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

**హార్ముజ్ ఉద్రిక్తతల ప్రభావం :** ఇటీవల హార్ముజ్ జలసంధి ఉద్రిక్తతల కారణంగా ప్రపంచ ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పర్షియన్ గల్ఫ్ నుంచి ప్రపంచానికి వెళ్లే చమురు సరఫరాలో సుమారు 20 శాతం ఈ మార్గం ద్వారానే జరుగుతుంది. దీంతో చమురు ధరలు భారీగా పెరిగాయి. ఈ పరిస్థితుల్లోనే మరో కీలక సముద్ర మార్గమైన మలక్కా జలసంధి గురించిన చర్చలు మొదలవడంతో ప్రపంచ వాణిజ్య రంగం అప్రమత్తమైంది. మలక్కా జలసంధి దాదాపు 900 కిలోమీటర్ల పొడవు కలిగిన సముద్ర మార్గం. ఇది తూర్పు ఆసియా, మధ్యప్రాచ్యం, యూరప్ మధ్య అతి తక్కువ దూరం కలిగిన సముద్ర రవాణా మార్గంగా భావిస్తారు. ఇండోనేషియా, మలేషియా, థాయ్‌లాండ్, సింగపూర్ దేశాల మధ్య ఈ జలసంధి ఉంది. ప్రపంచ చమురు రవాణాలో కూడా ఇది అత్యంత కీలక మార్గం. యూఎస్ ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ దీనిని ప్రపంచంలోనే అతిపెద్ద చమురు రవాణా అవరోధ బిందువుగా పేర్కొంది.

**భారీగా పెరిగిన నౌకా రాకపోకలు :** మలేషియా సముద్రయాన శాఖ గణాంకాల ప్రకారం, 2025లో మలక్కా జలసంధి గుండా 1,02,500కు పైగా నౌకలు ప్రయాణించాయి. 2024లో ఈ సంఖ్య 94,300 మాత్రమే ఉండగా, ఏడాదిలోనే గణనీయంగా పెరిగింది. అయితే, హార్ముజ్ తర్వాత మలక్కా జలసంధి కూడా సమస్యాత్మకంగా మారితే ప్రపంచ వాణిజ్యం, చమురు సరఫరా, ఇంధన ధరలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే ఇండోనేషియా వివరణ ఇచ్చినా, ఈ అంశంపై ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి.

# సంతోషం

అన్నీ ఉన్నా లేనట్టు ఉండు
ఏమీ లేకున్నా సరే
అన్నీ ఉన్నట్టు జీవించు
నీదగ్గర ఆస్థులు
ఉన్నాయంటే అసూయ
నీదగ్గర అంతస్థులు
లేదంటే చులకన
ఇది మనుషులు తీరు!
అసలు సంతోషం అనేది
ఒకరు ఇచ్చేది కాదు
నీకై నువ్వు నీలో నువ్వు
అనుభవించేది సంతోషం
సంతోషంగా ఉండడానికి
ఏమీ ఖర్చు లేదు
కానీ... మనం సంతోషంగా
ఉన్నామని ప్రపంచానికి
చాటి చెప్పడానికి మాత్రం
చాలా ఖర్చు చేస్తున్నాం
సంతోషమే సగం బలం
లేనిపోని ఆనందాలకోసం
అడ్డదారులు తొక్కుతూ
అన్ని దుఃఖాలను
కొని తెచ్చుకుంటున్నాం!
ఇప్పటికైనా మేలుకో!
నీలో ఉన్న అత్యాశను
పక్కనపెట్టు
రేపటి భవిష్యత్తు కోసం జీవించు!



రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
చరవాణి: 9866179385

## హైవేపై ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ పై అవగాహన : దగదర్తి ఎస్ఐ జంపాని కుమార్ చొరవ.



**దగదర్తి: విజ్ఞాన్ రిపోర్టర్ :**ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా దగదర్తి పోలీసు యంత్రాంగం వినూత్న కార్యక్రమం చేపట్టింది. మండల పరిధిలోని సున్నాంబట్టి ప్రాంతంలో జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ప్రాధాన్యతపై ఎస్ ఐ జంపాని కుమార్ మరియు పోలీసు సిబ్బంది ప్రత్యేక అవగాహన కల్పించారు.

**ముఖ్య అంశాలు:** ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యం: రహదారి ప్రమాదాల సమయంలో తలకు తగిలే గాయాల వల్ల ప్రాణాపాయం ఎక్కువగా ఉంటుందని, హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలను కాపాడుకోవచ్చని ా× జంపని కుమార్ వాహనదారులకు వివరించారు. నిబంధనల ఉల్లంఘనపై హెచ్చరిక: హెల్మెట్ లేకుండా ప్రయాణించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా స్పందన: హైవేపై వెళ్తున్న ప్రయాణికులను ఆపి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూనే, హెల్మెట్ ధరించమని కోరుతున్న పోలీసుల తీరును స్థానికులు అభినందించారు. "ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల క్షేమాన్ని కోరి హెల్మెట్ ధరించి ప్రయాణించాలి. నిర్లక్ష్యం వల్ల ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు." జంపని కుమార్, ా×, దగదర్తి ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై కరపత్రాలను పంపిణీ చేసి, భవిష్యత్తులో హెల్మెట్ ధరిస్తామని వారి చేత ప్రతిజ్ఞ చేయించారు.

## ఏసీబీ కస్టడీలో దేవాదాయ-శాఖ అధికారి



శాంతిఆదాయానికి మించి ఆస్తుల కేసులో అరెస్టైన సస్పెండైన దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతిని ఏసీబీ అధికారులు మరోసారి కస్టడీలోకి తీసుకున్నారు. ఇటీవల ప్రశ్నించినప్పుడు సరైన సమాధానాలు చెప్పకపోవడంతో, కోర్టు అనుమతితో విజయవాడ జిల్లా జైలు నుంచి కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు.

## అగ్నిప్రమాద బాధితులకు అండగా నిలిచిన మంత్రి నారాయణ



**నెల్లూరు సిటీ.. ఏప్రియల్. 24/.(విజ్ఞాన్ ప్రతి నిధి )....**నగరంలోని నక్క లోళ్ల సెంటర్ లో ఒక బొమ్మలదుకాణం అగ్ని ప్రమాదానికి గురైంది వ్యాపారం కోసం తెచ్చిన సామానులు బొమ్మలు పూర్తిగా కాలిపోవడంతో రాష్ట్రపురపాలక పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకొన్నారు .అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి అయోమయంలో పడిన బాధితులకు అండగా నిలిచి నేనున్నాననే భరోసా కల్పించారు. నెల్లూరు సిటీ 45 వ డివిజన్ నక్కలోళ్ళ సెంటర్ లో శుక్రవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది జీవనాధారం కోల్పోవటంతో వీధిన పడ్డ బాధితులు దిక్కుతోచని అయోమయంలో పడిపోయారు .తన కార్యాలయం ద్వారా సమాచారం తెలుసుకొన్న మంత్రి నారాయణ వెంటనే స్పందించారు .టీడీపీ నేతలను సంఘటనా స్థలానికి పంపి బొమ్మలదుకాణం నడుపుతున్న బాధితులకు భరోసా కల్పించారు .తక్షణ సాయం కింద తన సొంత నిధి నుంచి 20 వేల రూపాయలను ప్రకటించారు .మంత్రి నారాయణ సింగపూర్ అధికారిక పర్యటనలో ఉండటంతో మంత్రి తరపున నగదును టీడీపీ నేతలు బాధితులకు అందించారు .ప్రభుత్వం నుంచి రావాల్సిన ఇతర పరిహారాలకోసం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు . ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ,స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు సుజన్, శ్రీనివాసులు రెడ్డి, నాగేంద్ర రోజ్ మేరీ,వీరు తదితరులు పాల్గొన్నారు .

## అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ తో నిఘా..

**-చామదల గ్రామ శివారులో డ్రోన్ నిఘా నిర్వహించిన..**
**-జలదంకి ఎస్సై సయ్యద్ లతీఫున్నిసా..**

**జలదంకి విజ్ఞాన్ దినపత్రిక** బహిరంగ ప్రదేశాల్లో నిర్వహిస్తున్న అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్లతో నిఘా వేశామని, చట్టాలకు అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని జలదంకి ఎస్సై సయ్యద్ లతీఫున్నిసా హెచ్చరించారు.. నెల్లూరు జిల్లా ఎస్పి డా అజిత వేజెండ్ల, కావలి డి.ఎస్.పి వి.వి రమణ కుమార్, కలిగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బారావు ల ఆదేశాలతో శుక్రవారం మండలంలోని చామదల గ్రామంలో నిర్మానుష్యమైన ప్రాంతాలతో పాటు పలు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించామన్నారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాల కట్టడికి ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారం, అక్రమ కార్యకలాపాలు, మరియు ప్రజా భద్రతకు విఘాతం కలిగించే పరిస్థితులను గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ.. పలు ప్రాంతాలలో డ్రోన్ ద్వారా అ ప్రాంతంలోని భౌగోళిక పరిస్థితులు, మార్గాలు, మరియు అనుమానాస్పదగా కనిపించే చలనాలను రికార్డు చేయడం జరిగిందన్నారు. ఎటువంటి డ్రోన్ పర్యవేక్షణలు తరచుగా నిర్వహించడం ద్వారా మండలంలో నేర కార్యకలాపాలను అరికట్టడంలో పెద్దగా ఉపయోగపడుతుందని, ప్రజలు ఎటువంటి అనుమానాస్పద చలనం గమనించినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు..



## కట్టుబడిపాలెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**కావలి విజ్ఞాన పత్రిక** చెన్నూరు (కట్టుబడిపాలెం): కట్టుబడిపాలెం (ఆఫ్ చెన్నూరు) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ (చీవీమీ) పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. జాతీయ స్థాయి ఉపకార వేతనానికి అర్హత సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు విచ్చేసి, ప్రధానోపాధ్యాయులు బీవీ సుబ్బారావు మరియు ఆంగ్ల ఉపాధ్యాయులు డి. పెంచల ప్రసాద్‌లకు పౌర సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ జాతీయ స్థాయి గుర్తింపు పొందేలా తమ పిల్లలను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ పిల్లలు ఉపకార వేతనానికి ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ప్రధానోపాధ్యాయుల స్పందన:
ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. "జాతీయ స్థాయి ఉపకార వేతనానికి (చీవీమీ) మన పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం చాలా గర్వకారణం. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల వల్లే ఈ ఫలితం సాధ్యమైంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వేముల రమణయ్య, ఎస్ఎంసి వైస్ చైర్మన్ చల్లగుండ్ల వెంకటరమణమ్మ, పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆపద్భాంధవ సేవాట్రస్ట్ వృద్ధాశ్రమమును,సందర్శించినస్వచ్ఛంద సంస్థలు

**కావలి : విజ్ఞాన దినపత్రిక న్యూస్** స్వచ్ఛందసంస్థల గౌరవ అధ్యక్షులు ాఖ. బాష ఆధ్వర్యంలో కావలి వైకుంఠపురం పెంకుల ఫ్యాక్టరీ దగ్గర ఆపద్భాంధవ సేవా ట్రస్ట్ అధ్యక్షులు, దామ మధుసూదన్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమమును స్వచ్ఛంద సంస్థలప్రతినిధులు, సందర్శించి, వారికి అందిస్తున్న సేవలు, సౌకర్యాలు, వసతులు,గురించి,పరిశీలించి,అక్కడ ఉన్న వారిని అడిగితెలుసుకొని సంతృప్తివ్యక్తపరచడమైనది. గౌరవ అధ్యక్షులు బాష,మీకోసంసేవా సంస్థ దిలీప్ కుమార్ ప్రసంగిస్తు-..దామ మధుసూదన్ రావు, =వీూ గ వైద్య వృత్తి ని కొనసాగిస్తూ-మరియుప్రతిరోజు కనీసం ఒక పేదవారి కయినా కడుపు నింపాలిఅనెవినాదముతో కొంత వారి స్వీయ నిధులు,కొంత దాతలసహాకారంతోఎన్నో మంచి సామాజిక సేవా కార్యక్రమములు,నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎంతోమంది,వయో వృద్దులు ఇంటిదగ్గర సరియైన ఆలనా,పాలన లేకఎన్నో, అవస్థలు, ఇబ్బందులు పడుతున్నారు అటువంటి వారికి తగు రీతిలో సహకారం అందించాలని,మంచి సదుద్దేశముతో, కావలి వైకుంఠపురం పెంకులఫ్యాక్టరీ వద్ద వృద్దాశ్రమమును అన్ని వసతులతో ఏర్పాటుచేసి,వారికీఅంకిత భావం, సేవా భావంతో, వైద్య సహకారంతో అందిస్తున్నారని,ఈ మంచి




అవకాశమును అవసరం అయినవారుఉపయోగించుకోవచ్చునుఅని తెలిపారు, పై కార్యక్రమంలో..రత్నమ్మ ఫౌండేషన్ ఎంవీ ప్రసాద్ రావు,మీకోసం సేవా సంస్థ రాయపాటి దిలీప్ కుమార్,ప్రగతి ఎడ్యుకేషనల్, సొసైటీ ా౦. రమణయ్య, ఆపద్భాంధవ సేవా ట్రస్ట్ దామ మధుసూదన్ రావు, జాగో సేవా సంస్థ ాఖ జమీర్,టైమ్ టు హెల్ప్ నందిపాటి రమేష్,గుడ్ మెన్ ా. బ్రహ్మయ్య, ఘంటసాల, రామచంద్రయ్య, వంటేరు మస్తానయ్య, క్యాంటిన్ సాయి,మాధవ తదితరులు పాల్గొన్నారు.

## ఇక నుంచి హోటళ్లను ఆకస్మికంగా తనిఖీ చేస్తా..!

**-హోటళ్ల పరిసరాలు, వంట గది అత్యంత పరిశుభ్రంగా ఉండాలి..!**
**- మాంసాన్ని నిల్వ చేసినా, గడువు తీరిన పదార్థాలను వినియోగించినా హోటళ్ళను సీజ్ చేస్తాం..!**
**-ఒకసారి వినియోగించిన నూనెను మళ్ళీ వాడరాదు..**
**-నిబంధనలు పాటించకుంటే హోటళ్ల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం..**
**-జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల హెచ్చరిక**
**-నగరంలోని హోటళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ అజితా వేజెండ్ల**

నెల్లూరు "నగరంలోని హోటళ్ళను ఎప్పుడైనా ఆకస్మికంగా తనిఖీలు చేస్తాం... ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం" అని జిల్లా కలెక్టర్ హోటల్ నిర్వాహకులను హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని పలు హోటళ్లను ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి కలెక్టర్, ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటల్ రియాజ్, బసోటో హోటళ్లను తనిఖీ చేసి ఆహార పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రియాజ్ హోటల్ లో పరిసరాలు పరిశుభ్రంగా లేవని, శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బిర్యానీని స్వయంగా పరిశీలించారు. కిచెన్ లో ఉన్న చికెన్ ను ప్లాస్టిక్ కవర్లలో ఉంచకూడదని, పెరుగు ప్యాకెట్ ఎక్స్పైరీ డేట్ గడువు ఒక్కరోజుతో ముగుస్తుంటే ఇంకా ఎందుకు వాడకుండా ఉంచారని నిర్వాహకులను ప్రశ్నించారు. పెరుగును ఉదయాన్నే తీసుకొచ్చామని సాయంత్రం వంటకానికి వినియోగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హోటళ్ళ నిర్వాహకులు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తప్పకుండా పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన తాజా ఆహార పదార్థాలను అందించాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా నిల్వ ఉంచకూడదని సూచించారు. ప్రధానంగా హోటల్లో పరికరాలు, వంటగది, భోజన శాల అత్యంత పరిశుభ్రంగా ఉండాలని, తాజా నాణ్యమైన ఆహార పదార్థాలను



వినియోగదారులకు అందించాలని ఆదేశించారు. మాంసాన్ని నిల్వ ఉంచినా, వినియోగదారుల నుంచి హోటళ్ళపై ఏ ఒక్క ఫిర్యాదు అందినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోటల్ రియాజ్, బసట హోటళ్లకు జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇంప్రూవ్మెంట్ నోటీసులను జారీ చేశారు. రెండు వారాల్లోగా హోటల్ లను పరిశుభ్రంగా, పరిసరాలను, వంటగదిని అత్యంత పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, లేకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారులు హోటళ్ళ నిర్వాహకులకు సూచించారు. ఈ తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్డీవో అనూష, తాసిల్దార్ షఫీ మాలిక్ తదితరులు పాల్గొన్నారు...

## మంగళగిరి నేతన్న విగ్రహం వద్ద జరిగిన నిరాహార దీక్షను విరమించిన ఆంధ్రప్రదేశ్ చేనేత సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ నెల్లూరుజిల్లా నాయకులు

**కావలి : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ :** మంగళగిరిలో నేతన్న విగ్రహం వద్ద రెండు రోజులు నిరాహార దీక్షలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ నెల్లూరు జిల్లా నాయకులు పముజల శంకరయ్య, మమజుల హరి, మధిర దయాకర్, బట్ట సుబ్బారావు రెండు రోజులు జరిగిన నిరాహార దీక్షలో పాల్గొని ఈరోజు నిరాహార దీక్షను విరమించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వై ఎస్ ఆర్ సి పి ప్రభుత్వం నేతన్ననేస్తం పథకం ద్వారా ప్రతీ చేనేత కుటుంబానికి,ప్రతీ సంవత్సరం 24 వేలు అందించింది. 100 యూనిట్ల విద్యుత్ అమలు చేసింది..చేనేత ఫించన్లు మంజూరు చేసింది..వాటిని కూడా కొనసాగించలేని దౌర్భాగ్యస్థితిలో కూటమి ప్రభుత్వం ఉన్నదని మరి ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడానికి కారణం ఏమిటని ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఒక్క నేతన్ననేస్తం పథకమే అమలు జరగకపోవటం వలన రాష్ట్ర వ్యాప్తంగా చేనేతలు సుమారు 400 కోట్లు కోల్పోయారని ప్రతీ చేనేత కార్మికుడుఏడాదికి 50వేల రూపాయలు నష్టపోయారని సాధారణ ఎన్నికలలో చేనేతలపై వరాల జల్లు కురిపించిన కూటమి ప్రభుత్వం చేనేతలను ఘోరంగా మోసం చేసిందని మోసం చేసిందని అన్నారు చేనేతకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే చేనేతల సత్తా ఏందో చూపుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ప్రస్తుతం ప్రభుత్వంతో సఖ్యతగా ఉన్న టిడి పి చేనేత నాయకులు ఏమి చేస్తన్నట్లుచేనేతపరిశ్రమ పరిస్థితి వీరికి కనిపించట్లేదా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి హామీలు అమలు చేయించి చేనేతపరిశ్రమను,కార్మికులను ఆదుకునేలా చేయాలని ఈ నిరాహార దీక్ష తో నైనా ప్రభుత్వాలు ముందుకు వచ్చి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం చెయ్యటానికి పూనుకుంటారని ఆశించామని కానీ ప్రభుత్వాలు ముందుకు రాని ఎడల భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వాలకు రాష్ట్రంలోని చేనేత వర్గాలు యావత్తు రానున్న కాలంలో ప్రభుత్వాలు తగని మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల కో కన్వీనర్లు బండారు ఆనందప్రసాద్,పిల్లలమర్రి నాగే శ్వరరావు,,పిల్ల మర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు.



# పల్లె సీమల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

**గ్రామాలు అభివృద్ధి చెందితేనే సమాజం బాగుంటుంది**
**జాతీయ స్థాయిలో గుండుమల గ్రామానికి అవార్డు**
**శుభపరిమాణం : మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**



**ప్రకాశం / తూర్పు నాయుడుపాలెం, ఏప్రిల్ 24:** పంచాయతీ రాజ్ వ్యవస్థ లో అనేక సంస్కరణలు తీసుకువచ్చి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పనిచేస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్లో జరిగిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు శ్రీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీ పి రాజాబాబు, ఒంగోలు, సంతనూతలపాడు శాసన సభ్యులు శ్రీ దామచర్ల జనార్దన్ రావు, శ్రీ బి ఎన్ విజయకుమార్లతో కలసి పాల్గొన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ, మహాత్మాగాంధీ గారు పల్లె సీమలు అభివృద్ధి చెందాలి, గ్రామ స్వరాజం రావాలని నినాదం తీసుకురాగా, డా. బిఆర్ అంబేద్కర్ గారు గ్రామసీమలు ప్రత్యేకంగా అభివృద్ధి చెందాలని రాజ్యాంగంలో పొందపర్చడం జరిగిదన్నారు. స్థానిక పాలనా వ్యవహారాలను సమర్ధవంతంగా నిర్వహించడంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రాధాన్యతను గుర్తించి ప్రత్యేక రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీ రాజ్ వ్యవస్థకు చట్టబద్ధత తీసుకురాగా, ఆనాటి నుండి ప్రతి ఏటా ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాలు ప్రగతి పథంలో నడిచినప్పుడే దేశాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. క్షేత్ర స్థాయిలో మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, నిధుల వినియోగం లాంటి అంశాలను సమన్వయం చేయడం కోసమే పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పాటు అయినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు గ్రామాల అభివృద్ధి కి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు పంచాయతీ వ్యవస్థలో సమూలంగా మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. స్వర్ణ గ్రామంలో ప్రత్యేక సిబ్బందిని నియమించడంతో పాటు వారి పర్యవేక్షణకు మండల, జిల్లా స్థాయి అధికారులను కూడా నియమించి పూర్తి స్థాయిలో అభివృద్ధి సంక్షేమాన్ని సమర్ధవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. గుండమాల పంచాయతీకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం పట్ల సంబంధిత పంచాయతీ కార్యదర్శి లావణ్య ను ప్రత్యేకంగా మంత్రి అభినందించారు. గ్రామీణ స్థాయిలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే క్షేత్ర స్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు పూర్తిస్థాయిలో అర్హులైన గ్రామీణ ప్రజలకు అందేలా పంచాయత్ వ్యవస్థ పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# బుచ్చిరెడ్డిపాళెం యువతకు విపిఆర్ ఫౌండేషన్ క్రీడా సామాగ్రి పంపిణీ

**- యువతను క్రీడల పట్ల ప్రోత్సహించడమే విపిఆర్ ఫౌండేషన్ లక్ష్యం.**
**- శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో అవసరం.**
**- సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు క్రీడాకారులకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతమ్మకు యువత కృతజ్ఞతలు.**



నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్లో ఉన్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి క్యాంప్ కార్యాలయంలో బుచ్చిరెడ్డిపాళెం పట్టణ యువతకు క్రీడా కిట్లను అందజేసే కార్యక్రమం ఘనంగా జరిగింది. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని మొత్తం 20 వార్డులకు చెందిన యువకులకు విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20 క్రికెట్ కిట్లు, 20 వాలీబాల్ కిట్లను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి వార్డులోని యువతకు నాణ్యమైన క్రీడా సామాగ్రిని అందించడం ద్వారా వారిలోని ప్రతిభను ప్రోత్సహించడమే విపిఆర్ ఫౌండేషన్ ఆశయమని ఆమె స్పష్టం చేశారు. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు క్రీడాకారులకు అండగా నిలుస్తున్న విపిఆర్ ఫౌండేషన్ మరియు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కి బుచ్చిరెడ్డిపాళెం యువత ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని తెలుగుదేశం ముఖ్య నాయకులు, కౌన్సిలర్లు మరియు పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

## టపాసుల దుకాణాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**-టపాసుల దుకాణాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ**



**నెల్లూరు, ఏప్రిల్ 24 :** నెల్లూరు నగరంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల విస్తృతంగా పర్యటించారు. శుక్రవారం సాయంత్రం నెల్లూరు నగరం పెన్నా నది పొర్లు కట్ట సమీపంలో ఉన్న టపాసుల విక్రయ దుకాణాలు, తయారీ కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. టపాసుల విక్రయానికి, తయారీకి వ్యాపారుల వద్ద లైసెన్సులను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న జాగ్రత్తలను స్వయంగా పరిశీలించారు. మంటలు ఆర్పే అగ్నిమాపక పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో పరిశీలించారు. వ్యాపారులు, తయారీదారులు నిబంధనలు తప్పకుండా పాటిస్తూ ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఘనంగా జరగనున్న వి ఎస్ యూ కళాశాల 16వ వార్షికోత్సవం

నెల్లూరు: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) కళాశాల 16వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 25వ తేదీ శనివారం అత్యంత వైభవంగా జరగనున్నాయి. వీఎస్‌యూ క్యాంపస్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం భవన్, తిక్కన కళాక్షేత్రం ప్రాంగణంలో సాయంత్రం 5:00 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని నిర్వాహక బృందం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రతిష్టాత్మక వేడుకలకు ముఖ్య అతిథులుగా వీఎస్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్ రావు యాదవ్, సర్వేపల్లి శాసనసభ్యులు శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హాజరుకానున్నారు. విశిష్ట అతిథిగా వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సునీత, గౌరవ అతిథులుగా నెల్లూరు జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి శ్రీమతి పి. వెంకట లక్షుమ్మ, వీఎస్‌యూ ప్రొఫెసర్ సీహెచ్. విజయ, ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించే ఆకర్షణీయమైన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించనున్నాయి. అనంతరం వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించనున్నారు.

# అభివృద్ధి, సంక్షేమాలకు బ్రాండ్ అంబాసిడర్ సిఎం చంద్రబాబు నాయుడు

**- మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ కానున్న కోవూరు.. పట్టణ స్థాయి వసతుల కల్పనే లక్ష్యం.**
**- కిసాన్ సెజ్‌కు పూర్వవైభవం.. టాటా వంటి దిగ్గజ కంపెనీల రాకతో యువతకు భారీగా ఉపాధి.**
**- ఇఫ్కో కిసాన్ సెజ్ లో పరిశ్రమలు వస్తున్నాయి, ఉద్యోగాల కోసం యువత వలసలు వెళ్లక్కర్లేదు.**
**- నిరుద్యోగ యువతకు పారిశ్రామిక శిక్షణకై విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయనున్నాం.**
**- ఎండ తీవ్రత నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తాం.**
**- కోవూరు పర్యటనలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.**



కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని నిరూపిస్తూ.. కేవలం 22 నెలల పాలనలోనే అభివృద్ధి, సంక్షేమాలను సమపాళ్లలో అమలు చేస్తున్నామన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి . కోవూరు పంచాయతీలోని 17వ మరియు 18వ వార్డుల సందర్శన కార్యక్రమంలో భాగంగా ఆమె ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అందరికీ పంచాయతీ రాజ్ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ కూటమి ప్రభుత్వ పాలనలో కోవూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఎండ తీవ్రత నేపథ్యంలో జాగ్రత్తగా వుండాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. గత ఐదేళ్ల విధ్వంసకర పాలనలో రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయని, ఆ పరిస్థితులను చక్కదిద్దుతూ ప్రతి గ్రామంలో తాగునీరు, సిసి రోడ్లు, డ్రైన్లు మరియు స్మశాన వాటికల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు. ఒక్క కోవూరు పంచాయతీలోనే 2 కోట్ల33 లక్షలతో 56 అంతర్గత సిసి రోడ్లు నిర్మించామని క్లీన్ కోవూరు కార్యక్రమంలో భాగంగా బాపన కాలువ సిల్ట్ క్లియరెన్స్ చేపట్టామని వివరించారు. పీటర్స్ కెనాల్‌పై బ్రిడ్జ్ నిర్మాణంతో దశాబ్దాల ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపామని త్వరలోనే మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ కానున్న కోవూరులో పట్టణ స్థాయి మౌలిక వసతులు కల్పిస్తామని ఈ సందర్భాంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హామీ ఇచ్చారు.గత 30 ఏళ్లుగా నిలిచిపోయిన ఇఫ్కో కిసాన్ సెజ్ లో కూటమి ప్రభుత్వం కదలిక తెచ్చిందని టాటా వంటి దిగ్గజ కంపెనీలు ఇక్కడ పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వస్తున్నాయని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెల్లడించారు. సిఎం చంద్రబాబు నాయుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కృషితో నెల్లూరు జిల్లాకు బీపీసీఎల్ లాంటి భారీ పరిశ్రమ రానుందని తద్వారా యువత ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఆమె ధీమా వ్యక్తం చేశారు. యువతకు సాంకేతిక శిక్షణ ఇచ్చేందుకు ఇఫ్కో కిసాన్ సెజ్ లో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయబోతున్నట్లు ఆమె ప్రకటించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో 76 లక్షల 32 వేల ఆర్థిక ప్యాకేజీతో గుమ్మళ్ళ దిబ్బ మరియు పాటూరు చేనేత కార్మికుల కోసం మినీ క్లస్టర్ సాధించామని దీనివల్ల 200 చేనేత కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. పేదల ఆకలి తీర్చే కోసం అన్నా క్యాంటీన్ అలాగే జవీ=ఖీ ద్వారా నియోజకవర్గంలో 61 మందికి రూ. 73 లక్షల ఆర్థిక సాయం అందించామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవం, లోకేష్ ఆధునికత, పవన్ కళ్యాణ్ కార్యదక్షతతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ఎమ్మెల్యే కొనియాడారు. సూపర్ సిక్స్ హామీలైన దీపం-2, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజాహిత పాలన అందిస్తున్నామని, సుపరిపాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన ముఖ్య నాయకులతో పాటు అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



**నెల్లూరు, ఏప్రిల్ 24:** ఎప్పుడూ బిజీగా ఉండే జర్నలిస్టులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సౌజన్యంతో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో 0 జర్నలిస్టులకు ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పై అవగాహన కలిగి ఉండడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేసే వారధిగా జర్నలిస్టులు పనిచేస్తున్నారని తెలిపారు. జర్నలిస్టుల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, వారి శ్రేయస్సు కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టికేంద్రీకరించిందని చెప్పడానికి ఈ హెల్త్ క్యాంప్ నిదర్శనమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మెగా ఉచిత క్యాంప్ ద్వారా జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు, అవసరమైన వైద్య సలహాలు, సూచనలు అందించడం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. శిబిరంలో గుర్తించిన ఆరోగ్య సమస్యలకు తగిన ఫాలో-అప్ చికిత్స తీసుకోవాలని, ఆరోగ్యంపై నిరంతరం శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులకు సంబంధించి గత రిపోర్టులను జిల్లా కలెక్టర్ పరిశీలించి తగు సలహాలు సూచనలు అందజేశారు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరెంటెంట్ డాక్టర్ మాధవి మాట్లాడుతూ రక్త పరీక్షలలో కిడ్నీ మరియు లివర్ సంబంధం అన్ని పరీక్షలతో పాటు లిక్విడ్ ప్రొఫైల్ , షుగర్ బిపి తదితర పరీక్షలు అన్ని నిర్వహించబడతాయన్నారు. సేకరించబడిన రక్త నమూనాలను బట్టి ప్రభుత్వ వైద్యుల సలహా మేరకు అవసరమైతే నిపుణుల సలహాలు తీసుకునే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. రక్త నమూనాలు ఇవ్వదలచిన జర్నలిస్టులు ఉదయం 7 గంటల నుండి ఖాళీ కడుపుతో వచ్చి రక్త మరియు యూరిన్ శాంపిల్స్ను అందించాలని ఆమె కోరారు. అంతేకాకుండా గతంలో ఏమైనా ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలు ఉన్నట్లయితే వాటికి సంబంధించిన రిపోర్టులను విధిగా తీసుకురావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి పి .వేణుగోపాల రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు వారి విధి నిర్వహణలో ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయక వార్తా సేకరణలో నిమగ్నమై ఉంటారని అటువంటి వారికి సరైన వైద్య సేవలు సలహాలు అందించే విధంగా పై అధికారులు మరియు సమాచార శాఖ మాత్యులు ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరెంటెంట్ సహాయ సహకారాలతో ఈ ఉచిత మెగా క్యాంపును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సదుపాయాన్ని జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ కోఆర్డినేటర్ డాక్టర్ అనిత మాట్లాడుతూ ఎవరైనా స్వచ్ఛందంగా రక్తదానం చేయొచ్చని వారికి తగిన సర్టిఫికెట్లను అందజేయడం జరుగుతుందని తెలిపారు..

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.